క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మంగళగౌరీ వ్రత పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

జియ్యమ్మవలస: మండలంలోని పెదబుడ్డిడి గ్రామంలో ఉన్న ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలోని పార్వతీదేవి ఆలయంలో మంగళగౌరీవ్రత పూజలు మంగళవారం నిర్వహించారు. ప్రధానార్చకులు అవధూత సూర్య నారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో మహిళలు పాల్గొని, కుంకుమార్చనలు చేశారు.

బ్యాంకు ఏర్పాటుకు కృషి చేయండి



మంత్రి ధర్మానతో వైఎస్సార్ సీపీ నేతలు గోపాలరావు పోతల మజ్జి

భామిని: ఎస్‌బీఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా), యూనియన్ బ్యాంకుల్లో ఏదైనా బ్యాంకు బ్రాంచిని మండల కేంద్రంలో ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు సోమరాజు గోపాలరావు, పోతల మజ్జి కోరారు. ఇదే విషయమై వారు శ్రీకాకుళంలో నివాసముంటున్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావును మంగళవారం కలిసి, విన్నవించారు. భామినిలో బ్యాంకు లేకపోవడం వల్ల చాలా మంది ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల సౌకర్యార్థం ఇక్కడ బ్యాంకు ఏర్పాటయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వంశధార నిర్వాసితులకు ప్రభుత్వం నుంచి అదనపు పరిహారం వచ్చేలా చూడాలన్నారు.

కుడ్డపల్లిలో ఆధార్ స్పెషల్ క్యాంప్



సచివాలయంలో ఆధార్ సేవలు అందిస్తున్న దృశ్యం

సీతంపేట: మండలంలోని కుడ్డపల్లి గ్రామ సచివాలయంలో ఆధార్ స్పెషల్ క్యాంప్ మంగళవారం నిర్వహించారు. ఆధార్ అప్‌డేట్ చేయాలనుకునే వారు, కొత్తగా ఆధార్ నమోదు చేసుకోవాలనుకునే వారు, ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేయాలనుకునే వారు సచివాలయాన్ని సంప్రదించాలని గ్రామ కార్యదర్శి పాపారావు తెలిపారు.

మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలి



విద్యార్థులు తింటున్న భోజనాలు పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రరావు

భామిని: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని ఎంపీడీవో జి.చంద్రరావు సూచించారు. మంగళవారం స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(బాలికలు)ను సందర్శించిన ఆయన విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను ఆయన పరిశీలించారు. ఆహార పదార్థాలు రుచి, శుచి కలిగి ఉండాలని, వేడివేడిగా ఉన్నప్పుడే వాటిని వడ్డించాలని తెలిపారు. ప్రిన్సిపాల్ కె.విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం



సీతంపేట మెయిన్‌రోడ్డులో వర్షపునీరు

సీతంపేట: మండల కేంద్రంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ఇన్నాళ్లు ఎండల కారణంగా విపరీతమైన ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది. మండల కేంద్రంతో పాటు మండలంలోని దోనుబాయి, గొయిది, సోమగండి, హడ్డుబంగి, కుడ్డపల్లి తదితర ప్రాంతాల్లో కూడా వర్షం కురిసింది. వరి ఉభాలకు ఈ వర్షం ఎంతో ఉపకరిస్తుందని రైతులు తెలిపారు.

గెలుపే లక్ష్యం కావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



సమావేశంలో పాల్గొన్న జేసీఎస్, సచివాలయ కన్వీనర్లు

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు గొండు కృష్ణమూర్తి

పాలకొండ: రాష్ట్రంలో 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం కావాలని, ఆ దిశగా అందరూ కలిసి పనిచేయాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు గొండు కృష్ణమూర్తి కోరారు. స్థానిక పట్టణంలోని ఏఎంజీ కన్వెన్షన్ హాల్‌లో నియోజకవర్గ స్థాయి జేసీఎస్, సచివాలయ కన్వీనర్ల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 వరకు టీడీపీ హయాంలో ప్రజలు ఎదుర్కొన్న పరిస్థితులు, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో నెలకొన్న సానుకూల పరిస్థితులను వివరించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు అన్ని రంగాలు, వ్యవస్థలు నిర్వీర్యమైపోయాయని, వాటికి పునరుజ్జీవం పోస్తున్న అభివృద్ధి ప్రదాత, సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే సీఎం జగనన్న ధ్యేయమని, నాలుగున్నరేళ్లలో అనేకానేక అభివృద్ధి పనులు చేపడుతూనే మరెన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. జేసీఎస్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులంతా ప్రజలతో మమేకమై, రాష్ట్రంలో జరుగుతున్న ప్రజాసంక్షేమ పాలనను వివరించాలని తెలిపారు. పార్టీ కోసం కష్టపడే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజలకు అందుతున్న సులభతరమైన సేవలు, నాడు-నేడు కార్యక్రమం ద్వారా జరుగుతున్న పాఠశాలలు, ఆస్పత్రుల ఆధునీకరణ పనులు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు ప్రతిఒక్కరికీ తెలిసేలా అవగాహన కార్యక్రమాలు రూపొందించి, అమలు చేయాలన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు పార్టీ అందిస్తున్న బీమా సదుపాయం కల్పిస్తోందన్నారు. సమావేశంలో నగరపంచాయతీ చైర్మన్ యందవ రాధాకుమారి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, నాలుగు మండలాల సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పొల్ల గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న గడికారెం, కోసమానుగూడ, రాయలంక, దుగ్గి తదితర గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేసిన పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజల బాగు కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు పరితపిస్తున్నారన్నారు. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యమే లక్ష్యంగా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి, గ్రామ స్థాయిలో అనేక అభివృద్ధి పనులు చేపడుతూనే ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు తీసుకువచ్చారన్నారు. మరోవైపు వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారన్నారు. ఆయా వ్యవస్థల పనితీరుతో దేశం చూపు రాష్ట్రం వైపు మళ్లిందన్నారు. అన్ని వర్గాల ప్రజలను సంతృప్తి పరిచేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతోందన్నారు. రాష్ట్రంలోని ప్రతీ ఇంటికి ఏదో ఒక పథకం రూపంలో మేలు జరుగుతోందన్నారు. ఓ వైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమం జరుగుతోందని, దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఈ విధమైన మంచి పాలన కొనసాగడం లేదన్నారు. అప్పటి టీడీపీ పాలనకు ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను ప్రజలు గమనిస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో అభివృద్ధి పనులు, పథకాలు కేవలం ఆ పార్టీ వారికి మాత్రమే దక్కేవన్నారు. ఇప్పుడు అలా కాదని, అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందించడం జరుగుతోందన్నారు. వీటితో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గిరిజనుల కోసం అనేకానేక పథకాలు అమలు చేయడంతో పాటు రాయితీపై అనేక సదుపాయాలు కల్పించడం జరుగుతోందన్నారు. గిరిజన ప్రాంతాల్లోని అర్హులకు ఇప్పటికే అటవీ హక్కుల సాగు పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు.

అలాగే మారుమూల ప్రాంతాల్లో కూడా వైద్య సేవలు అందేలా బైక్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారన్నారు. సీతంపేటలో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం జరుగుతోందన్నారు. ప్రస్తుతమున్న ఏరియా ఆస్పత్రికి కూడా అదనపు భవనాలు నిర్మించడం జరుగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని, మరోసారి సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సత్యం, ఎంపీపీ బి.ఆదినారాయణ, ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహన్‌రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు ఎస్.రాము, ఎన్.అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వో విధుల నుంచి తప్పించండి

భామిని: బీఎల్‌వో(బూత్ లెవల్ ఆఫీసర్) విధుల నుంచి తమను తప్పించాలని వీఈవోలు కోరుతున్నారు. ఇదే విషయమై మండలంలోని వీఈవోలంతా మండల కేంద్రంలోని తహసీల్దారు నీలాపు అప్పారావును కలిసి, అదనపు బాధ్యతలతో వారు పడుతున్న ఇబ్బందులను వివరించారు. సచివాలయ సహాయ ఇంజినీర్లుగా గృహ నిర్మాణ నిర్మాణ పనుల పరిశీలన, ఇళ్ల నిర్మాణాల వేగవంతం పనులు చూస్తున్న తమకు బీఎల్‌వో బాధ్యతలు కూడా అప్పగించారని, అయినప్పటికీ విజయవంతంగా ఓటర్ల సర్వే పూర్తి చేశామని తెలిపారు. ఇకనైనా తమను బీఎల్‌వో విధుల నుంచి తొలగించాలని వినతిపత్రం అందజేశారు. వీఈవోలు బి.శ్రీవిద్య, బి.ప్రమోదుకుమార్ పాల్గొన్నారు.

జీజీఎంపీ నిధులతో అభివృద్ధి పనులు

సీతానగరం: గడప గడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ) నిధులతో ప్రారంభించిన పనులు వేగవంతం చేయాలని పీఆర్ ఏఈ చంద్రమౌళి కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన వెన్నెల బుచ్చింపేటలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని పనులను మంజూరుచేశారన్నారు. అప్పట్లో మంజూరైన పనులకు ప్రభుత్వం నిదులు విడుదల చేయడంతో నిర్వాహకులు ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో ఇంజినీసహాయకులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

సాలూరు: మహిళా సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించేలా కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు వెలుగు ఏపీఎం సింహాచలం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వెలుగు సమాఖ్యలో సీసీలు, వీఓఏలతో సమీక్షా సమావేశాన్ని ఆయన నిర్వహించారు. సమావేశంలో గ్రామీణ పేదరిక నిర్మూలన పథకం ఉద్దేశాన్ని వివరించారు. మహిళా సంఘాల సభ్యులు ఆర్థిక స్వావలంబన సాధించే విధంగా కృషి చేయాలని స్పష్టం చేశారు. రికవరీలు, ఆన్‌లైన్ వర్క్‌లపై దృష్టి సారించాలని చెప్పారు.

జూట్ మిల్లు తెరవాలంటూ ధర్నా

సాలూరు: మండలంలోని జీగిరాం జ్యూట్ ఫ్యాక్టరీని తెరవాలని డిమాండ్ చేస్తూ కార్మికులు నిరవధిక ధర్నా చేపట్టారు. జూట్ మిల్లు వర్కర్స్ జేఏసీ ఆధ్వర్యంలో ఈ మేరకు మంగళవారం ఫ్యాక్టరీ గేటు వద్ద నిరసనకు దిగారు. గడిచిన 13 నెలల నుంచి ఫ్యాక్టరీ మూసివేయడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఫ్యాక్టరీ తెరవాలని డిమాండ్ చేశారు.

నియామకపత్రాల అందజేత



వలంటీర్లకు నియామకపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ రామారావు


గరుగుబిల్లి: కొత్తగా వలంటీర్లుగా ఎంపికైనా వారికి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఉరిటి రామారావు చేతులమీదుగా మంగళవారం నియామకపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అర్హులకు ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. నియామకపత్రాలు అందుకున్న వారిలో మండలంలోని రావివలస, రావుపల్లి, దళాయివలస, చినగుడబ, గరుగుబిల్లి, నాగూరు గ్రామాల వలంటీర్లు ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.మహేశ్వరరావు, నాయకులు ఎం.అప్పారావు, జి.శ్రీనివాసరావు, సీహెచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ది బెస్ట్ 'ఇస్రో'



చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ భామిని మండలం, బత్తిలిలోని కనోసా ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు చంద్రయాన్-3ని రూపొందించి, ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేత్తలకు మంగళవారం ఆల్ ది బెస్ట్ తెలిపారు. బుధవారం చంద్రుని దక్షిణ ధ్రువంపై ల్యాండర్ అడుగుపెట్టనుంది. ఈ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారం సాయంత్రం 5 గంటల నుంచి ఫేస్‌బుక్, టీవీల్లో వస్తుందని ఇస్రో అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు రూపొందించిన చంద్రయాన్-3 ప్రయోగ నమూనా ఆకట్టుకుంది. -భామిని

సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు సన్మానం



సన్మాన గ్రహీతలతో ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కృష్ణమూర్తి

పాలకొండ: స్థానిక పట్టణంలోని ఏఎంజీ కన్వెన్షన్ హాల్‌లో ఇటీవల జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లో గెలుపొందిన వైఎస్సార్ సీపీ మద్దతుదారులైన సర్పంచ్‌లు, వార్డు మెంబర్లను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు గొండు కృష్ణమూర్తి కలిసి మంగళవారం ఘనంగా సన్మానించారు. అనంతరం వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని కోరారు. సన్మాన గ్రహీతల్లో పనులకువలస సర్పంచ్ కోట మంజుభార్గవి, నీలాగనరం వార్డు మెంబర్ గురాన శ్రీరాములు, అన్నవరం వార్డు మెంబర్ రాగోలు అరపాదకుమార్, వీపీ రాజుపేట వార్డు మెంబర్ బొమ్మలాట శాంతమ్మ, కీసరజోడు వార్డు మెంబర్ సున్నపురం బుడ్డు, కొత్తగూడ వార్డు మెంబర్ నిమ్మక పగడాలమ్మ, దోనుబాయి వార్డు మెంబర్ ఆరిక నవీన్, కడగండి వార్డు మెంబర్ సవర శరత్‌కుమార్, దుగ్గి వార్డు మెంబర్ ఆరిక రవి ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే పోలీస్ వ్యవస్థ



గరుగుబిల్లి: మాట్లాడుతున్న సీఐ ప్రసాద్‌రావు



గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులకు పోలీసుల విధులపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ షణ్ముఖరావు



జియ్యమ్మవలస: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ కళాధర్

గరుగుబిల్లి: శాంతిభద్రతల పరిరక్షణకే పోలీస్ వ్యవస్థ ఉందని చినమేరంగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాదరావు అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాల(బాలికలు)లో నో యువర్ పోలీస్(మీ పోలీస్ గురించి తెలుసుకో) కార్యక్రమంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పోలీసులంటే కొంతమందిలో భయం నెలకొందని, ఆ భయం పోగొట్టేందుకే ఫ్రెండ్లీ పోలీసింగ్ సిస్టమ్ నిర్వహించడం జరుగుతోందన్నారు. బాలబాలికలు, మహిళలు, వృద్ధులు ఎవరైనా ఏదైనా సమస్య ఎదుర్కొన్నా, ఏ రకమైన ఇబ్బంది పడినా, హింసకు గురైనా తక్షణమే పోలీసుల టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. ఎక్కడ ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎం.రాజేష్, ప్రిన్సిపాల్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నో యువర్ పోలీస్(నీ పోలీస్ గురించి తెలుసుకో) కార్యక్రమం మంగళవారం నిర్వహించి, పోలీసులు ఏ విధంగా సమాజానికి ఉపయోగపడతారన్న విషయాన్ని విద్యార్థులకు ఎస్‌ఐ కళాధర్ వివరించారు. ప్రతీ విద్యార్థి మంచి పౌరుడుగా ఎదగాలని ఆకాంక్షించారు. శాస్త్ర,సాంకేతిక జ్ఞానం పెంపొందించుకోవడంతో పాటు సామాజిక విద్యను నేర్చుకోవడం కూడా ముఖ్యమేనన్నారు.

'నో యువర్ పోలీస్'..

గుమ్మలక్ష్మీపురం: శాంతిభద్రతలు కాపాడుతూ ప్రజల స్వేచ్ఛాయుత జీవనానికి ఎటువంటి ఆటంకం కలగకుండా చేయడంతో పాటు ప్రజల ఆస్తుల పరిరక్షణకే పోలీస్ వ్యవస్థ ఉందని ఎల్విన్‌పేట సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.షన్ముఖరావు తెలిపారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలోని భద్రగిరి గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల(బాలురు)లో నో యువర్ పోలీస్(నీ పోలీస్ గురించి తెలుసుకో) కార్యక్రమంపై అవగాహన కల్పించారు. తొలుత పోలీస్ వ్యవస్థ, పోలీస్ చట్టాల ద్వారా ప్రజలకు అందుతున్న రక్షణను వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాలు జరగకుండా చూడడం పోలీసుల ప్రధాన బాధ్యత అన్నారు. ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలని, ఎక్కడైనా ఎటువంటి ఘోరం జరిగినా వెంటనే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో పోలీసుల శాఖాపరమైన విధులు, బాధ్యతలు ఎస్‌ఐ బి.శివప్రసాద్ వివరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా పోలీసులకు సకాలంలో సమాచారం ఇచ్చి, శాంతిభద్రతలను కాపాడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ ఎం.శ్యామ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే మానవ మనుగడ

- ఏపీసీఎన్‌ఎఫ్ రీజనల్ ఆఫీసర్ జి.హేమసుందర్



కొమరాడ: బయో ఇన్పుట్ కేంద్రం సందర్శిస్తున్న ఏపీసీఎన్‌ఎఫ్ రీజనల్ ఆఫీసర్ హేమసుందర్



గుమ్మలక్ష్మీపురం: ద్రవజీవామృతం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: ప్రకృతి వ్యవసాయంతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని ఏపీసీఎన్‌ఎఫ్ రీజనల్ ఆఫీసర్ జి.హేమసుందర్ అన్నారు. జట్టు ఆశ్రమ పర్యవేక్షణలో నాబార్డ్ ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న మా తోట జీవ ప్రాజెక్ట్‌లో భాగంగా మండలంలోని వల్లాడ, గౌరడ, పెంగవ, రాయగడ జమ్ము గ్రామాల రైతులతో మంగళవారం సమావేశమై, ప్రకృతి వ్యవసాయం గొప్పతనం, ఆవశ్యకత, ప్రయోజనాలను వివరించారు. గౌరడ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లోనే అన్ని రకాల పంటలు సాగు చేసుకోవాలని, తద్వారా ఆరోగ్యవంతమైన పంట చేతికి వచ్చి, ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందన్నారు. ఏడాది పొడవునా పంటలు పండించి, అదనపు ఆదాయాన్ని రైతులు పొందడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్ట్ ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వరి సాగు చేసే రైతులంతా పొలంగట్లపై బంతి, వంగ, టమాటా, బెండ, చిక్కుడు వంటి పంటలు వేసుకోవాలని, అలా చేస్తే అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. అనంతరం మిరప, టమాటా, బంతి నారును రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఏ జి.అర్థపూర్ణ, మా తోట జీవ ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షుడు టి.జమ్మయ్య, కార్యదర్శి కె.చిరంజీవి, కో-ఆర్డినేటర్లు జి.ప్రబోధ్, జి.మురళిమోహన్, ఏపీసీఎన్‌ఎఫ్ కార్యకర్తలు, డీపీఎం పి.షన్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

ద్రవజీవామృతం తయారీపై అవగాహన..

ప్రకృతి వ్యవసాయంలో భాగంగా గుమ్మలక్ష్మీపురం మండలంలోని పెదఖర్జ గ్రామంలోని రైతులకు ద్రవజీవామృతం తయారీపై మంగళవారం అవగాహన కల్పించారు. ఏపీసీఎన్‌ఎఫ్ సీఆర్‌పీలు, కె.వెంకటేష్, పి.సంధ్య తొలుత ఆవుపేడ, ఆవుమూత్రంతో ద్రవజీవామృతం ఏ విధంగా తయారు చేయాలి, దానిని పంటలకు ఎలా పిచికారీ చేయాలని, దాని ప్రయోజనంను వివరించారు. కార్యక్రమంలో గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు హృదయేశ్వరి, వైకేపీ సీసీలు సూర్యనారాయణ, ఎన్.ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలి..

కొమరాడ: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని అలా అయితే ప్రజల ఆరోగ్య పరిస్థితులు మెరుగుపడతాయని ఏపీసీఎన్‌ఎఫ్ రీజనల్ ఆఫీసర్ జి.హేమసుందర్ అన్నారు. మండలంలోని నిమ్మలపాడులో ఉన్న బయో ఇన్పుట్ కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. అనంతరం అక్కడే ఉన్న పీఎండీఎస్ కిట్లు, ఘనజీవామృతం, తోటల కిట్లు, వృద్ధి ద్రావణం తదితర వాటిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ప్రధాన పంటతో పాటు పొలంగట్లపై బంతి, కంది, చిక్కుడు, బెండ పంటలు వేసుకోవాలని, తద్వారా అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. ప్రకృతి వనరుల కేంద్రంలో కషాయాలు, వృద్ధి ద్రావణాలు తయారు చేసి, వాటిని రైతులకు సరఫరాచ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ మేనజర్ శ్రీషణ్ముఖరాజు, తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: గిరిజన రైతులకు నారు అందజేస్తున్న ఏపీసీఎన్‌ఎఫ్ రీజనల్ ఆఫీసర్ హేమసుందర్